# నేహాల



సాయిబ్రహ్మానందం గొర్తి

# చరిత్రకి బలైన స్వేచ్ఛ కథ

(గత సంచిక నుంచీ తరువాయి)

## 16

ముద్గల్ ఊరి చివర్న ఏర్పరుచుకున్న స్థావరానికి దగ్గర్లో శంభుణ్ణి ఒక చెట్టుకి కట్టేసారు సైనికులు. కఠినంగా శిక్షించయినా శంభుడి నుండి నేహల వివరం రాబట్టమని చెప్పాడు నరేంద్ర గజపతి. ఎంత తీవ్రంగా కొరడాలు ఝుళిపించినా ప్రయోజనం లేకపోయింది.

శంభుడు నోరు విప్పలేదు. అతనికి ఇప్పుడు ప్రాణభీతి లేదు. కళ్ళెదుటే ముద్గల్ గ్రామం మొత్తం కల్లోలమయ్యింది. భయంతో అందరూ పారిపోడం చూసాక అతనిలో మొండితనం మరింత పెరిగింది. అందుకే ఎంతటి పెద్ద దెబ్బలనయినా ఓర్చుకున్నాడు. నరేంద్రగజపతి దుర్మార్గానికి ఒక ఊరు బలయ్యిందని లోలోపల రోదించాడు.

కొంతసేపటికి శంభుడి తల్లీ, తండ్రీ పరిగెత్తుకుంటూ అక్కడకొచ్చారు. కొడుకుని కాపాడ్డం కోసం బిగ్గరగా ఏడుస్తూ వచ్చారు. నరేంద్ర గజపతి వాళ్ళనీ ఒదిలిపెట్ట లేదు. వాళ్ళని శిక్షిస్తే చూడలేక శంభుడు నేహల విషయం చెబుతాడని అనుకున్నాడు నరేంద్ర గజపతి. అప్పటికే తగిలిన దెబ్బలకి శరీరం
ఆధీనంలో లేదు.

శంభుడి తల్లితండ్రుల్నీ చెట్టుకి కట్టి ఖఠినంగా కొట్టడం మొదలు పెట్టారు. అది చూళ్ళేక అసక్తుడిలా ఆక్రోశించాండు శంభుడు. సైనికుల కొరడా దెబ్బలకి తట్టుకో లేక స్పృహ తప్పి పడిపోయాడు. అది చూసి శంభుడి తల్లి గట్టిగా అరిచింది. అక్కడున్న సైనికులు ఆమెను మరింత బలంగా కొట్టారు. దెబ్బలు తట్టుకోలేక తలవాల్చింది. ఇది చూసి శంభుడి తండ్రికీ దుఃఖం ఆగలేదు.

ఈ ప్రపంచంలో ఏ మనిషి తనవాళ్ళ బాధని చూస్తూ భరించలేదు. అందునా నిస్సహాయతతో వీక్షించడం మించిన పెద్ద శిక్ష ఏవుంటుంది? శంభుడి తండ్రి అవి చూళ్ళేక బాధగా కళ్ళు మూసుకున్నాడు.

కొంతసేప సేపయ్యాక విజయనగరం తిరుగు ప్రయాణానికి సిద్ధం చెయ్యమని సైనికుల్ని ఆదేశించాడు నరేంద్రగజపతి. నేహల మరలా ఈ వూరు రాదు. వచ్చినా ఎవరూ ఆశ్రయం ఇవ్వరు. ఇచ్చినా వాళ్ళు బ్రతికి బట్ట కట్టలేరు. ఈ విషయం ఊరంతా దండోరా వేయించాడు. అతను అనుకున్న పని అయ్యింది. అక్కగారు ఉమాదేవి కాపురాన్ని నిలబెట్టానని లోలోపల సంతోషించాడు. మహారాజుకి ఆమె పారిపోయిందని చెబుతాడు. దానికి కారణం వేదరాయశర్మేనని చెప్పచ్చు కూడా. ఈ దెబ్బతో దేవరాయల వివాహం రద్దు. ఉమాదేవికి సవతిపోరు లేదని అనుకున్నాడు.

కానీ ఇప్పుడు చేసిన దుర్మార్గమే అతన్ని కాటేస్తుందన్న విషయం ఆ క్షణంలో గ్రహించలేకపోయాడు.

అధికారానికి ఆవేశానికీ ఎప్పటికీ జత కుదరదు. అందునా ఆవేశానికీ ఆలోచనకీ పొత్తు కుదరదు. ఆలోచనలేని చర్యలు ఎంతటి విపత్తుకయినా దారితీస్తాయి. పాలించే రాజులయితే మరీ ఘోరంగా ఉంటుంది. అది వాళ్ళ రాతలే కాదు, ప్రజల బ్రతుకు గీతల్ని కూడా తుడిచి పెట్టేస్తాయి.

ప్రస్తుతం అధికారమూ, ఆవేశమూ నరేంద్రగజపతిని వహించాయి.

అది ఎవరి రాతల్ని మారుస్తుందో దేవుడికే తెలియాలి.

0000000000000000

ఓ రాత్రివేళ ఎప్పుడు నిద్రపట్టిందో తెలీదు. వాకిట్లో వెచ్చటెండ మొహమ్మీద పడేసరికి ఒక్కసారి ఉలిక్కిపడి లేచి కూర్చుంది నేహల. కళ్ళు నులుముకొని చూస్తే కొంచెం దూరంలో రేవన్న కునికిపాట్లు పడుతూ కనిపించాడు. పక్కనే తల్లీ, తండ్రీ గాఢ నిద్రలో ఉన్నారు. తను లేచిన శబ్దానికి రేవన్నా ఉలిక్కిపడి లేచాడు. రాత్రంతా అతనూ నిద్రపోలేదని అర్థమయ్యింది నేహలకి. రాత్రంతా ఏదో తెలీయని బెంగ. ఏం జరిగిందో, ఇంకేం జరగబోతోందో తలుచుకుంటే అసలేమీ అర్థమే కావడం లేదు.

మహారాజుతో పెళ్ళి కాదనడం ఇంత విపత్కారానికి దారి తీస్తుందని ఊహించలేదు. తన కారణంగా వీళ్ళందరూ శిక్షింపబడుతున్నారు. దీనికంతటికీ కారణం గురువుగారు వేదరాయశర్మే కారణం. తను మహారాణి అయితే ఆయన ఏం బావుకుంటాడు? ఆయన ఇష్టాలని తన జీవితంపై రుద్దడానికి ఆయనకి అధికారం ఎవరిచ్చారు? తను వద్దందన్న కోపంతోనే సైన్యాన్ని పంపించుంటాడు. నయాన్నో, భయాన్నో తనని మహారాజుకి కట్టబెట్టాలని పథకం వేసుంటాడు. నేహలకి గురువుగారిపై పీకల వరకూ కోపం వచ్చింది. కానీ బయటకు వెళ్ళగక్కలేదు. నిస్తేజంగా రేవన్న కేసి చూసింది.

"భయం వేస్తోందా?" రేవన్న ఆమె కళ్ళలోకి చూస్తూ అడిగాడు.

లేదన్నట్లు తలూపింది. అతనూ మరిక రెట్టించలేదు. కొన్ని క్షణాల తరువాత ఆమే మాట్లాడింది.

"రేవన్నా! నా మూలాన మీ అందరికీ కష్టమొచ్చింది కదా?" మెల్లగా అంది.

"బాధపడకు నేహలా! కష్టమేమీ లేదు. నువ్వు నీ మనసుకు నచ్చింది చెప్పావు. చేసావు. అధికార దర్పంతో మహారాజు దండెత్తి వస్తే ఎవరేం చెయ్యగలరు? ఏం కంగారు లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో రాయచూరు వెళ్ళడమే మంచిదంటున్నాడు మసూం. నాకూ అదే సరైనదని అనిపిస్తోంది. కొంతకాలం అక్కడుండి ఈ గొడవలు సద్దుమణిగాక ముద్గల్ తిరిగి వెళ్ళచ్చు. ఈలోగా గురువుగారు మహారాజుకి నచ్చ చెబుతారన్న ఆశ నాకుంది."

"గురువుగారి పేరు నా దగ్గరెత్తద్దు. అసలిదంతా జరగడానికి ఆయనే మూల కారకుడు. నిక్షేపంగా నా జీవితం నేను గడుపుతూంటే చూళ్ళేక ఈ రసాభాస సృష్టించాడు. నా ఎదుటపడితే...?" పళ్ళు కొరుకుతూ ఆవేశంగా అంది నేహల.

"ప్రస్తుతం ఆయన్ని నిందించి ప్రయోజనం లేదు. ఈ గడ్డు పరిస్థితి నుండి ఆయనొక్కడే నిన్ను కాపాడగలడని నాకు తోస్తోంది. ఇప్పుడు జరిగింది తెలిస్తే ఏదో తొందరపాటులో చేసిన పనికి గురువుగారు తప్పకుండా బాధపడతారు. నిన్ను బంధించి పట్టుకురమ్మనమని ఆదేశించి ఉండచ్చు కానీ ఇలా ఊరంతా నేలమట్టం చెయ్యమని ఆదేశించుండరు. దీని వెనుక ఏదో కుట్ర దాగుందని నా అనుమానం. మన గురువుగారంటే మహారాజుకి ఎంతో గౌరవం. నేను ప్రత్యక్షంగా చూసాను. నాకు తెలిసీ గురువుగారు ఈ హింసని ప్రబోధించరు. ఎక్కడో ఏదో తప్పు జరిగింది. ఏమిటీ అన్నది తెలియడం లేదు."

"నువ్వెంత చెప్పు. గురువుగారిమీద నాకు గౌరవం పోయింది. మహారాజుకి నా వయసు కూతురుందని తెలిసి కూడా నన్ను వివాహం చేసుకోమని మహారాజుని రెచ్చగొట్టడం ఆయన సంస్కారాన్ని చూపెట్టింది. ఆయన దృష్టిలో డది భోగ విలాస వస్తువు. అందుకే నా ఇష్టాయిష్టాల ప్రసక్తి లేకుండా నా జీవితాన్ని నిర్దేశించాలని ప్రయత్నించారు. అది ఖచ్చితంగా దుర్మార్గం! "

"ఆయన్ని దూషించి ప్రయోజనం శూన్యం. జరిగిందేదో జరిగిపోయింది. ముందు ఇక్కడనుండి ఎలా బయట పడాలాని ఆలోచించాలి. సమయానికి మసూం వచ్చాడు కాబట్టి తప్పించుకో గలిగాం. లేకపోతే ఎవరూ నిన్ను రక్షించలేరు. నీకో విషయం తెలీదు. ఈ మసూం దేవరాయల వేగుగా రాయచూరులో పనిచేస్తాడు. కావాలనుకుంటే మనల్ని క్షణంలో మహారాజుకి అప్పగించగలడు. అలాంటిది.."

"ఈ మసూం నీకెలా పరిచయం?" రేవన్న మాటల్ని ఖండిస్తూ అంది.

రేవన్న తనకి మసూం ఎలా పరిచయమయ్యాడన్నది వివరించాడు. పక్కన ఏవో మాటలు వినబడేసరికి నేహల తల్లి తండ్రులూ నిద్ర లేచారు. తనకీ, నేహలకీ మధ్య జరిగిన సంభాషణ వారికి చెప్పాడు.

"మసూం మంచివాడులాగే ఉన్నాడు. నిన్న రాత్రి దారిపొడుగునా మాకు ధైర్యం చెబుతూనే ఉన్నాడు. మనల్ని ఎలాగయినా రక్షిస్తానని మాటిచ్చాడు. కానీ ఇప్పుడు నువ్వు అతనొక వేగు అంటే ఆశ్చర్యంగా ఉంది. అతనితో వెళ్ళడం...?" సందేహం వెలిబుచ్చాడు హరీంద్ర.

రేవన్న రాయచూరు వెళ్ళి అక్కడ తలదాచుకోవడమొక్కటే ప్రస్తుతం తమకున్న ఒకే ఒక దారని చెప్పాడు.

కూతురి పరిస్థితి చూసి వెక్కి వెక్కి ఏడిచింది నేహల తల్లి. అది చూసి హరీంద్ర కళ్ళ నీళ్ళు పెట్టుకున్నాడు. నేహల మాత్రం ధైర్యంగానే ఉంది. ప్రస్తుతం రాయచూరు వెళ్ళడమే శ్రేయస్కరమని తోచింది ఆమెకు.

రేవన్నకి తన అంగీకారం చెప్పింది.

ఎప్పుడు బయల్దేరి వెళ్ళేదో చెప్పమంది. కంటనీరు పెట్టిన తల్లి తండ్రుల్ని సముదాయించింది.

రేవన్న రాయచూరు ప్రయాణం ఏర్పాట్లకోసం మసూంని అడుగుదామని అక్కడనుండి లేచాడు.

అతను వీధి గుమ్మం వైపు వెళుతూండగా "రేవన్నా!" అంటూ పిలిచింది నేహల.

ఏమిటన్నట్లు చూసాడు.

"నువ్వు ఇలా వచ్చినట్లు మీ ఇంట్లో చెప్పావా?"

"శంభుడి చేత కబురంపాను. భయం లేదు. మా ఇంట్లో ఎవరూ కంగారు పడరు." చెప్పాడు రేవన్న.

నేహల ఏదో ఆలోచిస్తున్నట్లుగా తల దించుకుంది.

"ఏం? ఎందుకనడుగుతున్నావు?" మరలా తిరిగి ప్రశ్నించాడు.

"ఏం లేదు. నువ్వు మాతో రాయచూరు రాగలవాని...?" మెల్లగా అంది.

"ఓ అదా! మిమ్మల్ని మరలా ముద్గల్లో మీ ఇంట దించే బాధ్యత నాది. అంతవరకూ మిమ్మల్ని ఒదిలి వెళ్ళేది లేదు...మా ఇంట్లో వాళ్ళుంటావా? వాళ్ళేవరూ కంగారు పడరన్న నమ్మకం నాకుంది" తన నిర్ణయం చెప్పి వీధివైపు వెళ్ళాడు.

అతని సమాధానం విన్నాక కాస్త ధైర్యం వచ్చింది నేహలకి. ఇదే విషయాన్ని తల్లి తండ్రులకూ వివరించింది.

ఒక్కసారి స్థిమితంగా కూర్చుని ఆలోచిస్తే కానీ ఏం జరిగిందో అర్థం కావడం లేదు. ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని అందరూ ఉన్న పళాన పారిపోయారు. దేవుడి దయవల్ల ఎవరికంటా పడకుండా తప్పించుకోగలిగారు. ఒకవేళ పొరపాటున సైనికుల చేతికి చిక్కుంటే? రేవన్నే లేంకుంటే ఇలా వచ్చుండే వారుకారు. శంభుడు కూడా సమయానికొచ్చి హెచ్చరించకపోతే ఏమయ్యుండేది? రేవన్న చెప్పినదీ సబబుగానే ఉంది. వేదరాయశర్మ ముద్గల్ వచ్చే వరకూ ఎవరికంటా పడకుండా చూసుకోవాలి. నిదానంగా ఆలోచిస్తే ప్రస్తుతం - ఆయనొక్కరే తనని రక్షించ గలరు. ఏం జరిగిందో, జరుగుతుందో అంతుపట్టడం లేదు. పరిపరివిధాల ఆలోచిస్తూ అక్కడే చతికిల బడిపోయింది నేహల.

0000000000000000

నరేంద్రగజపతి అనుకున్నది సాధించాడు. మహారాజు వివాహాన్ని ఆపగలిగాడు. సేనల్ని తీసుకొని తిరుగు ప్రయాణం మొదలుపెట్టాడు. మహారాజుకి తమ దౌర్జన్యం గురించి తెలిస్తే ఊరుకోడని ఒక సైనికాధికారి సందేహం వెలిబుచ్చితే - ముద్గల్ వాసులు తమపై తిరుగుబాటు చేసారని చెబుదామన్నాడు. తాము ఎంతో సమ్యమనంగా, సామరస్యంగా మహారాజు ఆదేశాన్ని చెబుతూంటే రాళ్ళతోనూ, ఆయుధాలతోనూ సైనికుల మీద దాడి చేస్తే, గత్యంతరం లేకపోయిందని చెబుదామన్నాడు. దీనికంతటికీ కారణం గుల్బర్గా సుల్తానులే కారణం అన్నది వివరించవచ్చాన్నాడు. వాళ్ళ వెన్నుదన్నులే చూసి ముద్గల్ వాసులు ఎదురుతిరిగినట్లుగా నమ్మించాలని అధికారులని ఒకటికి రెండు సార్లు హెచ్చరించాడు.

సైనికులందరూ నరేంద్ర గజపతి దౌర్జన్యం ప్రత్యక్షంగా చూసారు.

అందుకే నోరు మెదపలేదు. ఒకవేళ ఏదైనా మాట జారినా వాళ్ళ ప్రాణాలకే ముప్పొస్తుందన్న విజ్ఞత వాళ్ళకుంది. విజయనగరం చేరే వరకూ ఎవరూ నోరెత్త కూడదని నిశ్చయించుకున్నారు.

వచ్చిన సైనికుల్లో కొందర్ని తోడుగా తీసుకొనీ, మిగతా సైనికుల్ని మెల్లగా విజయనగరం రమ్మనమని ఆదేశించాడు నరేంద్ర గజపతి. కొంతమంది ముఖ్య దండనాయకుల్ని తనతో పాటు తోడుగా రమ్మనమని జెప్పి గుర్రాల మీద బయల్దేరారు.

దేవరాయలకి ఈ ముద్గల్లో జరిగింది మొదట తానే చెవిని వేయాలని నిశ్చయించుకున్నాడు. వేరెవరయినా మహారాజుకి జరిగింది జరిగినట్లు చేరవేస్తే తనకే ప్రమాదం. తనే ముందు చెబితే తరవాత చేప్పే వాళ్ళని నమ్మే అవకాశం తక్కువ. అసలు విషయం మహారాజుని చేరకుండా తనూ ప్రయత్నాలు చెయ్యవచ్చనీ అనుకున్నాడు. అందుకే విజయనగరం చేరే వరకూ ఎక్కడా ఆగే ప్రసక్తి లేదనీ ఎంత రాత్రయినా చేరాల్సిందేననీ చెప్పాడు. అతని ఈ తొందరపాటు అర్థం చేసుకోలేనంత అమాయకులు కారు దండనాయకులు. అలాగేనంటూ అనుసరించారు.

నరేంద్ర గజపతి ఎక్కిన గుర్రాలు వేగంగా విజయనగరం వైపు పరుగు తీసాయి.

0000000000000000000000000000

ఇక్కడ గుల్బర్గాలో -

గిసుదరాజ్ ఆదీనంలో చిక్కుకుపోయాడు హసన్! మొదట్లో అక్కడ దుర్భరంగా అనిపించింది.

అలవాటవ్వడానికి కొంతకాలం పట్టింది. విలాసవంత జీవితానికి అలవాటు పడ్డ శరీరం చాలా మొరాయించింది. ఒంటి నెప్పులూ, సలపరాలూ ఎక్కువయ్యాయి. అవన్నీ భరించలేక మొదట్లో పారిపోదామని ప్రయత్నించాడు. గిసుదరాజూ, అతని మనుషులూ వెయ్యి కళ్ళతో తనని పరీక్షిస్తున్నారని మెల్లగా తెలిసింది. పారిపోదామని చేసిన ఒకటి రెండు ప్రయత్నాలు బెడిసి కొట్టాక విరమించుకున్నాడు. గిసుదరాజ్ దగ్గరుండడం నరకంలా అనిపించేది. తనతో మాట్లాడుతూ, ఎప్పుడూ తన యోగక్షేమాలు పట్టించుకుంటూ అక్కడ మెహజబీన్ ఉండడం కొంతలో కొంత నయంగా అనిపించసాగింది. కాలం గడిచే కొద్దీ మెహజబీన్ కూడా హసన్‌లో మార్పు గమనిస్తోంది. ఆమెకు కావల్సింది కూడా అదే!

గిసుదరాజ్ దైనందిన దినచర్యకి హసన్ అలవాటు పడిపోయాడు. మొదట్లో మధిర లేకుండా గడపడం కష్టమయినా రాను రానూ అలవాటు చేసుకున్నాడు. అతని ఆరోగ్యమూ మెరుగు పడింది. ప్రవర్తనలోనూ వచ్చిన మార్పు చూసి గిసుదరాజ్ సంతోషించాడు. ఎప్పుడైనా హసన్ తల్లి సుల్తానా రెహనా వచ్చి పోయేది. ఫిరోజ్‌షాకూడా రాజకీయ సలహాలకోసం వచ్చేవాడు. అతనూ కొడుకులో వస్తున్న మార్పు చూసి ఆనందించాడు.

ఎప్పుడైనా అహ్మద్‌ఖాన్ వచ్చేవాడు. గతంలోలా కాకుండా అతనూ భీమనది కాలువ పనులు పేరు చెప్పి గిసుదరాజ్ వద్దకు రావడం తగ్గించాడు. ఫిరోజ్‌షాకి చిన్న అవసరమున్నా స్వయంగా విచ్చేసేవాడు. భార్యని వెంటబెట్టుకొని మరీ వచ్చేవాడు.

భీమనది కాలువ పనులు పూర్తయ్యాయి. ఒకనాడు ఫిరోజ్‌షా, అహ్మదుఖాన్ గిసుదరాజ్ నివాసానికి కలిసొచ్చారు. గౌరవ పలకరింపులు ముగిసాకా అన్నదమ్ములిద్దర్నీ తన మందిరానికి హ్వానించాడు గిసుదరాజ్! అన్నదమ్ములిద్దరి రాకకూ కారణం ఏమిటని అడిగాడు. ఏమైనా రాజకీయ వ్యవహారమాని ప్రశ్నించాడు.

భీమనది కాలువు పనులు అనుకున్న దానికంటే ముందే జరిగాయని చెబుతూ, అక్కడే నిర్మించిన చిన్న కోటని గిసుదరాజ్ చేతుల మీదుగా ప్రారంభించమని అర్థించారు.

"మౌలియా! మీ చేతుల మీదుగా ఫిరోజాబాదు మందిరాన్ని ప్రారంభించాలి. మీరొచ్చి అక్కడ నమాజు చేయాలి. ఇది మాదీ, ఈ గుల్బర్గా రాజ్య ప్రజల ఆకాంక్షానూ! మీరొస్తే భీమనది కాలువని కూడా చూడచ్చు. అనుకున్న దానికన్నా ముందుగనే ఇవన్నీ పూర్తి చేసాం. అంతా అల్లా దయ!" అంటూ సెలవిచ్చాడు అహ్మదుఖాన్!

"తప్పకుండా అలాగే కానిద్దాం! భీమనది కాలువ పనులు అనుకున్న దానికన్నా ముందుగా పూర్తిచేయడం మెచ్చుకోతగ్గ విషయం. ప్రజల అవసరాలే మంచి పరిపాలనకి మార్గ నిర్దేశకాలు! ఈనాడు నాకెంతో సంతోషంగా ఉంది. గుల్బర్గాకి మంచి సుదినాలొచ్చాయి." అంటూ అహ్మాదుఖాన్ భుజం తట్టాడు గిసుదరాజ్!

వినయం నటించడంలో అహ్మాదుఖాన్ తరువాతే ఎవరైనా! తన గొప్పేమీ లేదనీ అంతా గిసుదరాజూ, అన్న ఫిరోజుల ప్రేమాభిమానాలే తనకి స్ఫూర్తని చెప్పాడు.

"సుల్తాన్ ఫిరోజ్! మీ అబ్బాయి హసన్ మాకు ఎంతో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. రెండు నెలల్లో ఎంత మార్పొచ్చిందో? ఇంకొక ఆర్నెల్లు ఇక్కడే ఉంటాడు. సూఫీ మత సాంప్రదాయలనీ, సిధ్ధాంతాలనీ వివరిస్తాను. మంచి పరిపాలనకి మతం ఎంతో సహకరిస్తుంది." అంటూ గిసుదరాజు ఫిరోజుషాతో అన్నాడు.

కొడుకు బాగుపడటమే తనకికావల్సిందనీ సరేనన్నాడు సుల్తాన్! హసన్ రాజ మందిరానికెంత దూరంగా ఉంటే తనకంత మంచిదని అహ్మాదుఖానూ అన్నగారిని సమర్ధించాడు.

మాటల్లో హసన్, మెహజబీన్ అక్కడికొచ్చారు.

"అదిగో! చోటా సుల్తాన్ వచ్చారు. రా హసన్!" అంటూ ఆహ్వానించాడు గిసుదరాజ్!

రాగానే అక్కడున్న వారికి సలాం చేసి తండ్రిని కౌగలించుకున్నాడు హసన్!

"అబ్బాజాన్! నేను మందిరానికి వద్దామనుకుంటున్నాను. మౌలియా గిసుదరాజ్ వద్దకు కావాలంటే ప్రతిదినమూ వస్తాను." అంటూ మనసులో మాట చెప్పడు హసన్.

"బేటా హసన్! మందిరానికి వెళితే చదువు మీద శ్రధ్ధ సన్నగిల్లుతుంది. నీ శిక్షణింకా పూర్తికాలేదని ఇప్పుడే మౌలియా గిసుదరాజ్ చెప్పారు. నువ్విక్కడ కొంత కాలం ఉండాల్సిన అవసరం వుంది." అంటూ ఫిరోజుషా అన్నాడు. తండ్రి మాటలు విని ఎంతో అసహనం కలిగింది హసన్‌కి.

"కొంతకాలం అంటే ఎంత కాలం?" చికాగ్గానే అన్నాడు.

"నీకు సౌకర్యాలు కావాలంటే చెప్పు. ఏర్పాట్లు చేయిస్తారు సుల్తాన్! కావాలంటే కొంతమంది పనివాళ్ళని పురమాయిస్తారు. అంతే కానీ..." గిసుదరాజ్ మాటలు పూర్తి కాకుండానే అక్కడనుండి వెనుదిరిగి వెళిపోయాడు హసన్. అతని కోపాన్ని గ్రహించిన మెహజబీన్ వెనుకే అనుసరించింది.

"కుర్రతనం! ఇక్కడ కాస్త ఇబ్బందిగా ఉందేమో? సేవకులు లేరన్న ఒక్క లోటూ తప్పిస్తే అతనికి సదుపాయాల్లో తక్కువేమీ లేదు. పైగా అమ్మాయి మెహజబీన్ కంటికి రెప్పలా చూసుకుంటోంది. ఇంకేం కావాలి? సుల్తాన్! మెహజబీన్ చాలా మంచి పిల్ల. ప్రత్యక్షంగా చూస్తున్నాను. నువ్వు ఆ పిల్లని కోడలుగా తెచ్చుకుంటే బావుంటుంది." గిసుదరాజ్ ఫిరోజుషాతో అన్నాడు.

కానీ సుల్తాన్ మనసులో వేరే లోచనుంది. మెహజబీన్ అంటే అతనికి మంచి అభిప్రాయంలేదు. గుల్బర్గా రాజ్య తిరుగుబాటు దారుడి కుమార్తె ఆమె! తను మంచి వాడు కాబట్టి వాళ్ళని బంధువులని చేరదీశాడు. అంతే కానీ వారి కుటుంబీకుల్ని సుల్తానాని చెయ్యడం అతని మనసుకి నచ్చలేదు. పైకి కాదని అనలేదు; అవుననని చెప్పలేదు.

అహ్మద్‌ఖాన్ ఇదే అదనుగా తలచి గిసుదరాజు సలహాని సమర్ధించాడు. హసన్ సుల్తాన్ కావడం అతనికి సుతారామూ ఇష్టం లేదు.

"హసన్ పూర్తిగా బాగుపడ్డాకా పెళ్ళి సంగతి ఆలోచిద్దాం! ముందు వాడొక మనిషి కావాలి. పరిపాలనా అవీ అర్థం చేసుకోవాలి. అయినా వాడి వయసెంత? ఇంకా ఇరవై రెండు కూడా రాలేదు. రెండేళ్ళ తరువాత సంగతి కదా? అప్పటి సంగతి ఇప్పుడే నిర్ణయించనవసరం లేదు." అంటూ తన అయిష్టాన్ని వేరే విధంగా వెలిబుచ్చాడు ఫిరోజ్‌షా.

ఇహ రెట్టించలేదు అహ్మద్‌షా! అన్నగారిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చెయ్యడు; ముఖ్యంగా గిసుదరాజ్ ముందు. ప్రస్తుతం అతనికి హసన్ పెళ్ళి ముఖ్య సమస్య కాదు.

ఆ తరువాత కొంతసేపు వేరే రాజ్య పరిపాలనా విషయాలు చర్చించి సెలవు తీసుకున్నారు అన్నదమ్ములిద్దరూ!

0000000000000000000000

(కొనసాగింపు వచ్చేసంచికలో)

POST COMMENTS